# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

మంగళవారం | 07 ఏప్రిల్, 2026 | పేజీలు : 08


# ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు

### ప్రసవాల సంఖ్యను పెంచాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంబంధించిన అంశాలపై కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/హనుమకొండ:** జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు మెరుగైన వైద్య ఆరోగ్య సేవలు అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ప్రసూతి, టీబీ ఆసుపత్రులలో అందిస్తున్న వైద్య ఆరోగ్య సేవలు, 102, 108 వాహనాలు, బ్లడ్ బ్యాంక్, తదితర అంశాల గురించి కలెక్టర్‌కు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, అధికారులు వివరించారు. ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించిన వివరాలతో పాటు వైద్యులు, సిబ్బంది పనితీరును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్యను పెంచాలని, సీ సెక్షన్ తగ్గించి సాధారణ ప్రసవాలు అయ్యే తరువాయి 2లో...

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ప్రజలు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరాలు కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఆరోగ్య వారోత్సవాల నిర్వహణలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం భూపాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి డా॥ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ఈట్ రైట్ వాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 6 నుండి 11 వరకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రజారోగ్యంపై ప్రతి రోజు జిల్లాలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజారోగ్యాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేయడం లక్ష్యంగా ఆరోగ్య వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వారోత్సవాల సందర్భంగా ప్రతి రోజుకు ప్రత్యేక థీమ్‌లను నిర్ణయించి, అనుసంధానిత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యక్రమాలు తరువాయి 2లో

# వైద్య శిబిరాలు సద్వినియోగం

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ






## రసాయన ఎరువుల వినియోగం వల్ల

# భూసారం దెబ్బతింటోంది

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాఫక్షం/సంగారెడ్డి :** ప్రజాపాలన ప్రగతి ప్రణాలిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ ఇక్రీశాట్ సంయుక్త ఆధ్వర్యంలో కొడంగల్ నియోజకవర్గానికి చెందిన యువ రైతులకు, సాయిల్ హెల్త్ వాలంటీర్లుగా రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం జిల్లాలోని పటాన్చెరు ఇక్రిశాట్ వ్యవసాయ క్షేత్రంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంబించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైజింగ్ తెలంగాణ 2045 లక్ష్యాలను అనుగుణంగా వ్యవసాయ రంగాన్ని ఆదునీకరించడం, అగ్రిటెక్ వినియోగాన్ని ప్రోతహించడం లాభసాటి పంటలు, పంటల విలువ వృద్ధి ద్వారా రైతుల ఆదాయన్ని పెంచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. రైతుల ప్రదాన ఆస్తి భూమి అని భూమి ఆరోగ్యంగా ఉంటేనే పంటల దిగుబడులు పెరిగి రైతుల ఆదాయం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. భూమి ఆరోగ్య పరిరక్షణలోపై రైతుల్లో అవగాహన పెంచడంలో సాయిల్ హెల్త్ వాంటీర్లు కీలక పాత్ర పోషించాలని సూచించారు. శాస్త్రీయ పద్దతులు సాంకేతిక పరిజ్ఞానం గ్రామీణ స్థాయికి చేరేలా వాలంటీర్లు కృషి చేయాలని తెలిపారు. రసాయన ఎరువుల అదిక వినియోగం వల్ల భూమి సారవంతత దెబ్బతింటోదని మంత్రి పేర్కొన్నారు. పంటల మార్పిడి ద్వారా భూసారం పెంపొందిచవచ్చని సూచించారు. రైతులు బయో ఫర్టిలైజర్లు సేంద్రియ ఎరువుల వినియోగించడం ద్వారా భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. అంతర్ పంటల సాగు ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందడమే కాకుండా నేల గుణాత్మకతను కూడా మెరుగు తరువాయి 2లో..

# వినతులు త్వరితగతిన పరిష్కరించాలి

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/వరంగల్ :** ప్రజావాణిలో అందిన వినతులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర సత్యశారద ఆదేశించారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్య శారద ప్రజల నుండి వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా సమర్పించిన వినతిపత్రాలను పరిశీలించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో దరఖాస్తుదారుల సమక్షంలోనే చర్చించి సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజావాణిలో అందిన వినతులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం తరువాయి 2లో..




# విద్యుత్ సప్లయ్ లేకపాయే.. రైతులు అల్లాడిపాయే..

విద్యుత్ లేక వరి పంటలకు ఇబ్బందులాయే..

విద్యుత్ అధికారులు సమస్య పరిష్కారం చేయాలని రైతుల వేడుకోలు..

# విద్యుత్ సప్లయ్ లేకపాయే.. రైతులు అల్లాడిపాయే..

**ప్రజాపక్షం/నడికూడ :** హనుమకొండ జిల్లా నడికూడ మండలం చర్లపల్లి గ్రామంలో గత పది రోజుల నుండి విద్యుత్‌తో ఇబ్బందులు పడుతున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికి అందిన వరి పంటలు విద్యుత్ లేకపోవడంతో వరి ఎండిపోయే పరిస్థితి ఉందని, చర్లపల్లి గ్రామ సబ్ స్టేషన్ నుండి విద్యుత్ సరఫరా వస్తే రిపేర్ కోసం చర్లపల్లి జేఎల్‌ఎంను అడిగితే మా పరిధి కాదు అని అనడం విడ్డూరంగా ఉందని రైతులు అయోమయానికి గురవుతున్నారు. విద్యుత్ సమస్య పట్ల విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా ఎలాంటి స్పందన లేదని రైతులు వాపోతున్నారు. అన్నం పెట్టే రైతన్నల పట్ల ఇంతటి నిర్లక్ష్యం చేయడం సరికాదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత పై అధికారులు స్పందించి రైతులకు విద్యుత్ సరఫరా పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని రైతులు పలువురు కోరుతున్నారు.

**విద్యుత్ సమస్యపై అధికారులు చొరచూపాలి..**
**పర్శబోయిన కిషన్ బాబు..**
**చర్లపల్లి గ్రామ రైతు..**



మాకు ఇటీవల కొత్తగా ట్రాన్స్ఫార్మర్ చర్లపల్లి చిన్న వాగు మాటు వద్ద పెట్టారు. గత పది రోజుల నుండి మాకు ట్రాన్స్ఫార్మర్‌తో చాలా ఇబ్బందులు అవుతున్నాయి దీనికి సప్లై చర్లపల్లి సబ్ స్టేషన్ నుండి వస్తుంది, రిపేర్ కోసం జేఎల్‌ఎం అడుగుతే అది నా పరిది కాదు శనిగరం జెఎల్‌ఎం చేస్తాడని అనడం విడ్డూరంగా అంటున్నాడు, శనిగరం మాకు చాలా దూరం అక్కడ నుండి జేఎల్‌ఎం రావడానికి చాలా ఇబ్బంది. మేము ఎవరికీ చెప్పుకోవాలో.. ఎవరితో చేయించుకోవాలో తెలుస్తలేదు పది రోజుల నుండి కరెంటు సరిగా రాక వరి పంట ఎండిపోతున్నాయి దయచేసి మాకు ఒక పరిష్కారం చూపించి మా మోటార్లు సక్రమంగా నడవడానికి విద్యుత్ పరిష్కారం అయ్యేలా సహకరించలని కోరుతున్నాం.

## పేదింటి ఆడపడుచులకు ప్రభుత్వం అండ

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/తొర్రూరు :** పేదింటి ఆడపడుచులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తొర్రూరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన 135మంది అర్హులైన లబ్దిదారులకు కల్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకంలో మంజూరైన చెక్కులను తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్‌కుమార్, గ్రామాల సర్పంచ్‌లతో కలిసి సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, మహిళా కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షురాలు పింగిళి ఉష, కౌన్సిలర్లు, గ్రామాల సర్పంచ్‌లు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/పర్వతగిరి :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలో రైతులకు తమ పంటకు సరైన ధర లభించేలా ప్రభుత్వం ముందస్తుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తెలిపారు. వరంగల్ జిల్లా మార్క్‌ఫెడ్ సహకారంతో సోమవారం పర్వతగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో మరియు ఏనుగల్లు గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం రైతుల పట్ల అనుకూల దృక్పథంతో పని చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రైతు కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపర్చడం, పంటలకు సరైన ధర కల్పించడం, వ్యవసాయానికి అనుకూల విధానాలు అమలు చేయడం ద్వారా రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నాగరాజు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మార్క్‌ఫెడ్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ప్రజా పాలనలో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సోమవారం 54వ డివిజన్ పరిధిలోని అపూర్వ కాలనీలో రూ.50 లక్షల వ్యయంతో అంతర్గత రోడ్లు మరియు డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో అపూర్వ కాలనీ అభివృద్ధికి కొంత నిధులు కేటాయించామని గుర్తు చేశారు. స్థానికంగా ప్రతి కాలనీ అభివృద్ధే తన లక్ష్యమని, రానున్న రోజుల్లో ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.ప్రాధాన్యత ఆధారంగా అభివృద్ధి పనులను వేగవంతంగా అమలు చేస్తున్నామని స్పష్టం చేసిన ఆయన, గత 10 ఏళ్లలో ఈ ప్రాంతం వెనుకబాటుతనానికి గురైన విషయాన్ని గుర్తుచేశారు. గడిచిన రెండేళ్లలో ప్రధాన సమస్యలపై దృష్టి సారించి గణనీయమైన పురోగతి సాధించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారివెంట స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



# చిన్న కాళేశ్వరం భూసేకరణ ప్రక్రియ వేగవంతం



జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** చిన్న కాలేశ్వరం ప్రాజెక్ట్‌కు అవసరమైన భూసేకరణ ప్రక్రియను రైతులను సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో భూ సేకరణ ప్రక్రియపై రెవెన్యూ, సర్వే, ఇరిగేషన్, మెగా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాజెక్టుకు భూములు అవసరమైన గ్రామా ల్లో గ్రామ సభల నిర్వహణకు ముందస్తుగా షెడ్యూల్ రూపొందించాలని అధికారులకు సూచించారు. గ్రామ సభల్లో రైతుల నుండి వచ్చిన అభ్యంతరాలను సమగ్రంగా పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిన్న కాలేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ప్రాజెక్ట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని భూ సేకరణను దశలవారీగా అమలు చేయాలని, ప్రాధాన్యత క్రమంలో సంబంధిత ప్రాంతాల్లో భూములను సేకరించాలని సూచించారు. ప్రాజెక్ట్‌కు అనుబంధంగా ఉన్న కాలువలు, ఇతర అవసరాల కోసం భూములు సేకరించబడుతున్నట్లు ఆయన తెలిపారు. సాగు, త్రాగునీటి అవసరాలను తీర్చడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఎస్డీసి రమేష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కుసుమకుమారి, ఇరిగేషన్, రెవెన్యూ, మెగా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను హెచ్చరించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం 80 దరఖాస్తులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేశారు. అనంతరం సంబంధిత శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. కాటారం సబ్ కలెక్టర్, డిపిఓ, డిఆర్డీఓ, పీఆర్ ఈఈ, మున్సిపాలిటీ, ఆర్డిఓ, విద్యుత్, ఎస్సీ అభివృద్ధి శాఖ, విద్యాశాఖ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖలలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వచ్చే వారం లోగా పూర్తి స్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి , ఆర్డిఓ హరికృష్ణతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు

(మొదటిపేజి తరువాయి)

విధంగా చూడాలన్నారు. టీబీ నియంత్రణకు చర్యలు చేపట్టాలని, విస్తృత స్క్రీనింగ్స్ చేయాలన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ అనుమానిత స్కానింగ్ సెంటర్లపై నిఘా పెంచాలని అన్నారు. ఆరోగ్య మహిళా కేంద్రాలలో మహిళలకు అవసరమైన స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్య సేవలు, ఫాలో అప్ చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఓపీ తక్కువగా ఉందని, ఓపి సేవలను పెంచాలన్నారు. ఎన్సీడీ స్క్రీనింగ్ వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి , డీసీహెచ్ఎస్ డాక్టర్ గౌతమ్ చౌహన్, టీబీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి, అడిషనల్ డీఎంహెచ్ వో మదన్ మోహన్ రావు, డిప్యూటీ డీఎంహెచ్ వో డాక్టర్ ప్రదీప్ రెడ్డి, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ నిఖిల్, డెమో అశోక్ రెడ్డి, ప్రోగ్రాం అధికారులు,ఆర్ బీ ఎస్ కె వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

## రసాయన ఎరువుల వినియోగం వల్ల భూసారం దెబ్బతింటోంది

(మొదటిపేజి తరువాయి)

పరచవచ్చని అన్నారు. వ్యవసాయ యాంత్రిక పద్దతులు ,టెక్నాలజీ ఆదారంగా లాభదాయక వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడం ద్వారా రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ముఖ్య కార్యదర్శి సురేందర్ మోహన్, ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సీటీ వైస్ చాన్సలర్, డాక్టర్ జానయ్య కొండా లక్ష్మణ్ హర్టికల్చర్ యూనివర్సీటీ వైస్ చాన్సలర్ డాక్టర్ రాజిరెడ్డి హార్టీకల్చర్ శాఖ డైరెక్టర్ షెక్ యాస్మిన్ భాషా, ఇక్రిసాట్ డైరెక్టర్ డాక్టర్ హిమాన్షు , పారక్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ స్లాన్ఫోర్ బ్లాడేజడ్పీ సీఈఓ జానకి రెడ్డి జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్, వ్యవసాయ అదికారులు శాస్త్రవేత్తలు ,రైతులు వాంటీర్లు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలు సద్వినియోగం

(మొదటిపేజి తరువాయి)

ఈ వారోత్సవాలలో భాగంగా ఆరోగ్య శిబిరాలు, స్క్రీనింగ్ పరీక్షలు, పోషకాహార కౌన్సెలింగ్, గృహ సందర్శనలు, ప్రసూతి శిబిరాలు, యోగా శిబిరాలు, ఆయుష్ వైద్య శిబిరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రులు (జిజిహెచ్) కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు (సిహెచ్‌సి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్ సి) ఉప కేంద్రాలలో ఈ కార్యక్రమాలు నిర్వహించబడతాయని ఆయన స్పష్టంచేశారు. ఆహార భద్రత అధికారి, ఎన్సిడి ప్రోగ్రామ్ అధికారులు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు, ఆయుష్ ఇన్‌చార్జులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు ఈ కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా॥మధుసూదన్, ఆహార తనిఖీ అధికారి వరుణ్ రెడ్డి, ప్రోగ్రాం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వినతులు త్వరితగతిన పరిష్కరించాలి

(మొదటిపేజి తరువాయి)

150 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. అందులో రెవెన్యూ శాఖకు చెందినవి 58, జిడబ్ల్యూఎంసికి చెందినవి 27, ఇతర శాఖలకు సంబంధించినవి 65 దరఖాస్తులు ఉన్నట్లు వెల్లడించారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా వచ్చిన నేపథ్యంలో, వాటిని సంబంధిత తహసీల్దార్లకు ఎండార్స్ చేసి త్వరితగతిన పరిష్కారం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రజావాణిలో వినూత్నంగా, దరఖాస్తుదారుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు జూమ్ వీడియో కాల్ ద్వారా సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలతో కలెక్టర్ సమన్వయం చేసి, దరఖాస్తుదారుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తూ ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. దీనిపై దరఖాస్తుదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, వైవి గణేష్, జెడ్పీ సీఈవో రామ్ రెడ్డి, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, డిఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, డిపిఓ కల్పన, విద్యాశాఖ అధికారులు, తదితర జిల్లా అధికారులు,ప్రజలు పాల్గొన్నారు.

## పొలిటికల్ సైన్స్‌లో కల్లేపల్లి ప్రశాంత్‌కు డాక్టరేట్

**ప్రజాపక్షం/కెయు క్యాంపస్ :** హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామానికి చెందిన కల్లేపల్లి ప్రశాంత్‌కు కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. "ఇంపాక్ట్ ఆఫ్ రిజర్వేషన్స్ ఆన్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ ఇన్ తెలంగాణ స్టేట్ – ఎ స్టడీ" అనే అంశంపై సమర్పించిన పరిశోధన గ్రంథానికి గాను ఆయనకు పొలిటికల్ సైన్స్‌లో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పిహెచ్ డీ) పట్టా మంజూరు చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కె. రాజేందర్ తెలిపారు. ఈ పరిశోధనను కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం పర్యవేక్షణలో ప్రశాంత్ విజయవంతంగా పూర్తి చేశారు. కాకతీయ యూనివర్సిటిలోనే ఎం.ఏ, ఎంపిజె చదివిన ప్రశాంత్, ఎం. ఎలో గోల్డ్ మెడల్ సాధించడం విశేషం. సాధారణ గ్రామీణ నేపథ్యంలో ప్రారంభమైన ఆయన విద్యా ప్రయాణం, డాక్టరేట్ సాధనతో ఉన్నత స్థాయికి చేరింది.ప్రశాంత్ డాక్టరేట్ సాధించిన సందర్భంగా అధ్యాపకులు, పరిశోధకులు, గ్రామస్తులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

## ఈట్ రైట్ వాక్‌పై అవగాహన ర్యాలీ

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో సోమవారం ఉదయం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఫుడ్ సేఫ్టీ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'ఈట్ రైట్ వాక్' (ఆహార భద్రతపై ప్రత్యేక దినం) కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా పబ్లిక్ గార్డెన్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి, ప్రజల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఆహార భద్రతపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

## అక్రమంగా నిల్వ చేసిన 23 సిలిండర్లను సీజ్.. కేసు నమోదు



**ప్రజాపక్షం/దేవరుప్పుల:** మండలంలో అక్రమంగా గ్యాస్ సిలిండర్లు నిల్వ ఉన్నాయని, రీఫిల్లింగ్ చేస్తున్నారని సమాచారం మేరకు జనగామ డిటిసిఎస్ లచ్చు నాయక్, ఎఆర్ఐ అశోక్, దేవరుప్పుల పోలీస్ సిబ్బంది సంయుక్తంగా తనిఖీ చేసి మండలంలోని కోలుకొండ, సింగరాజుపల్లి గ్రామాలలో 23 సిలిండర్లను స్వాధీనం చేసుకుని 6ఏ కేసు నమోదు చేసినట్లు డిటిసిఎస్ లచ్చు నాయక్ తెలిపారు.

# బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/కమలాపూర్:** బిజెపి దేశం కోసం పుట్టిన పార్టీ అని బిజెపి మండల అధ్యక్షులు ర్యాకం శ్రీనివాస్ తెలిపారు. కమలాపూర్ మండల వ్యాప్తంగా బిజెపి ఆవిర్భవించి 46 సంవత్సరాలు పూర్తి చేసుకోని 47వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా కమలాపూర్, ఉప్పల్, భీంపల్లి, శనిగరం, మాదన్నపేట, గూనిపర్తి గ్రామాలలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిపారు. కమలాపూర్ మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు ర్యాకం శ్రీనివాస్ ఆధ్వర్యంలో బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... దేశం కోసం, సనాతన ధర్మం కోసం మాత్రమే పుట్టిన పార్టీ, అంత్యోదయ సిద్ధాంతం ద్వారా ప్రతి పేదవానికి సంక్షేమ ఫలాలు అందజేయాలనే ఆకాంక్షతో నెలకొల్పిన పార్టీ బిజెపి పార్టీ అని అన్నారు. బిజెపి ప్రభుత్వం కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రావడానికి నరేంద్ర మోడీ కృషితో పాటు సగటు కార్యకర్త కృషి కీలకమని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా బిజెపి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్, తోట సురేష్, బండి కళాధర్, బుర్ర కరుణాకర్, భూపతి ప్రవీణ్, తుమ్మ శోభన్ బాబు, కనుకుంట్ల అరవింద్, ఇనుగాల రత్నాకర్, జెట్టి సారంగపాణి, భోగి బిక్షపతి, చలికి శ్రీనివాస్, మౌటం రమేష్ బాబు, పెండ్యాల ప్రభాకర్ రెడ్డి, జెర్రిపోతుల రాజేందర్, బండి సంపత్, అకినపల్లి రవీందర్, గుర్రం సురేష్, పుస్కూరి రాంబాబు, రావుల ఆకాష్, పెసరబోయిన విజయ కుమార్, మార్గం చైతన్య, జై, లక్ష్మ ణ్, నరిగే ఓదెలు పాల్గొన్నారు.

## వ్యాస రచన పోటీలో విజేతలకు బహుమతులు ప్రదానం



**ప్రజాపక్షం/వేలేరు :** డా,బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని 'భారత రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ పాత్ర'అనే అంశంపై 04,04,2026 రోజున పాఠశాల స్థాయిలో వ్యాస రచన పోటీలు నిర్వహించి పాఠశాల స్థాయి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులు పొందిన విద్యార్థులకు బహుమతులు అందించడమే కాకుండా 06,04,2026 రోజున మండలస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించగా ఇందులో 18 మంది విద్యార్థులు పాల్గొనగా మండలకేంద్రానికి చెందిన జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపిక కాగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం సత్తయ్య ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి మొగిలిచెర్ల చంద్రమౌళి చేతుల మీదుగా ప్రథమ బహుమతి విజేత బి రవిత్రేని, రూ,516, ద్వితీయ బహుమతి విజేత కె షర్షిత రూ,316,తృదీయ బహుమతి విజేత బి సాహితి రూ,216 నగదు అందిచడంతో పాటుగా పోటీలలో పాల్గొన్న వారికి ప్రోత్సాహక బహుమతులను అందిచడం జరిగింది, ఈసంధర్భంగా ఎంఇ ఒ చంద్రమౌళి మాట్లాడుతూ డా,బిఆర్ అంబేద్కర్ ప్రపంచ మేధావిగా ఎలా గుర్తించ బడ్డారు,ఆయన చేసిన కృషి ఏమిటి ఆయన రచించిన భారత రాజ్యాంగం గూర్చి నేటి తరం అంబేద్కర్ జీవిత చరిత్రను తెలసుకోవాల్సి ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు.భారత రాజ్యాంగంను అనుసరించే మనకు తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవిందని కొనియాడుతూ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం గూర్చి ప్రతిఒక్కరు తెలసు కోవల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ మొగిలిచెర్ల చంద్రమౌళి,జడ్.పి.హెచ్.ఎస్ వేలేరు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఎం సత్తయ్య,సోషల్ ఫోరం కన్వీనర్ కె గుంశావళి,కోకన్వీనర్ ఎండి ఇస్మాయిల్, వివిధ పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు వివిధ పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## విచ్ఛిన్నకర రాజకీయాలకు వ్యతిరేకంగా బిజెపి పోరాటం

**ప్రజాపక్షం/నర్సింహులపేట :** విచ్ఛిన్నకర రాజకీయాలకు వ్యతిరేకంగా బిజెపి పోరాటం చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు కుంభం అశోక్ రెడ్డి అన్నారు.సోమవారం మండల కేంద్రంలో బిజెపి 47 ఆవిర్భావ వేడుకలలో భాగంగా మం డల పార్టీ అధ్యక్షులు సూరబోయిన సతీష్ ఆధ్వర్యంలో బిజెపి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతి తక్కువ సమయంలో ప్రజల ఆదరణ చురగొని దేశంలోనే నెంబర్ వన్ పార్టీగా బిజెపి ఏర్పడిందన్నారు. అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా బిజెపి అనేక రాష్ట్రల్లో అ ధికారాన్ని చేపట్టిందన్నారు. పార్టీ అధికాంలోకి వచ్చాక శత్రుదేశాలు దాడి చేసేందుకు కూడా వెనుకడుగు వేశాయన్నారు.కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక కుల ,మత ఘర్షణలు లేవని తెలిపారు.

**సబ్ కాసాత్ సబ్‌కా వికాస్ అనే నినాదంతో** అడుగులు వేస్తుందన్నారు. కార్యక్రమంలో మం డల ప్రధాన కార్యదర్శి ఏరనాగి కుమారస్వామి, మండల ఉ పాధ్యక్షులు నెలకుర్తి సత్యనారయణ రెడ్డి,మెరుగు యాక య్య, జిల్లా నాయకులు ఎర్ర వెంకట్రాంనర్సయ్య,బీజేవైఎం మండల ప్రెసిడెంట్ పొడుపుగంటి ఆంజనేయులు,ఎస్సీమోర్చా అధ్యక్షులు ఎర్ర నితీష్,బూత్ అధ్యక్షులు హరీష్ కుమార్, అనిల్, సోమిరెడ్డి, దామోదర్ పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి



**ప్రజాపక్షం/నెక్కొండ :** రైతు లేనిదే రాజ్యం లేదు...రైతు బాగుంటేనే దేశం బాగుటుందని నర్సంపేట ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి పేర్కొన్నారు. రైతుల సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం పంట పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడం ద్వారా రైతులకు భరోసా కల్పిస్తుందని ఆయన తెలిపారు. నెక్కొండ వ్యవసాయ కార్యాలయ కేంద్రంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎంఎల్ఏ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ పంటను మధ్యవర్తులకు అమ్మి నష్టపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2400 మద్దతు ధర అందించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా కృషి చేస్తున్నదని వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిట నీరజ, పర్సన్ ఇన్‌చార్జి డి విమల, టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు బొంపెల్లి దేవేందర్ రావు, మండల అధ్యక్షులు బక్కి అశోక్, సర్పంచ్ హరిప్రసాద్, యువజన కాంగ్రెస్ నాయకులు చల్లా శ్రీపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ప్రసిడెంట్ రావుల తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కేంద్రం ప్రారంభంతో మొక్కజొన్న రైతులకు నేరుగా లాభం చేకూరుతుందని, ప్రభుత్వంపై రైతుల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని స్థానిక నాయకులు అభిప్రాయపడ్డారు.

## ఆలయ నిర్మాణానికి శ్రీకారం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ం 57వ డివిజన్ పరిధిలోని అశోక కాలనీలో నూతనంగా నిర్మించను న్న శ్రీ సీతారామాంజనేయ స్వామి వారి ఆలయానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు సతీమణితో శ్రీమతి నాయిని నీలిమ రెడ్డి గారితో కలిసి కు టుంబ సమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాలనీ పెద్ద లు, భక్తులు ఏకమై, ఆత్మీయతతో ఆలయ నిర్మాణం చేపట్టడం ఎం తో అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శ్రీ సీతారామాంజనే య స్వామి వారి అనుగ్రహంతో కాలనీ ప్రజలందరికీ శాంతి, సౌ భాగ్యం కలగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థా నిక నాయకులు, కాలనీ వాసులు, భక్తులు పాల్గొన్నారు.

## కూనూరు పాఠశాలలో యోగా కార్యక్రమం



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** ప్రపంచ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూనూరులో యోగా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా హెచ్ఎం పర్వాజ్ మాట్లాడుతూ పీఎం శ్రీ బడ్జెట్ కింద 100 యోగ మ్యాట్స్ కొనుగోలు చేసినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా యోగాను పాఠశాలల్లో ప్రవేశపెట్టడం జరిగిందని, ఫిజికల్ డైరక్టర్ ఆకుల సాయికుమార్ ఆధ్వర్యంలో సాంబరాజు పిల్లలకు ఉత్తమ శిక్షణ ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రామమూర్తి, స్వరూప రాణి, విజయశ్రీ, కవిత, సిరాజుద్దీన్, సుచరిత, సరళ, రాణి, నాగార్జున, సురేందర్, జైసింగ్, రాథోడ్, సబేరా బేగం, రాంబాబు, పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌లు

**ప్రజాపక్షం/చిట్యాల:** నూతన తహశీల్దార్‌గా తుకుంట్ల వసంతరావు, నాయబ్ తహశీల్దార్‌గా మూడవత్ అనిల్ కుమార్‌లు చిట్యాల తహసిల్ కార్యాలయంలో సోమవా రం బాధ్యతలు చేపట్టినట్లు వారు తెలిపారు. కరీంనగర్ జిల్లా ఎన్ పోర్స్‌మెంట్ విభాగం నుండి చిట్యాల తాహశీల్దార్‌గా తుకుంట్ల వసంతరావు, భూపాలపల్లి జిల్లా పలిమేల మండలం నుండి నయాబ్ తాహశీల్దార్‌గా మూడవత్ అనిల్ కుమార్ చిట్యాల తహసిల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. చిట్యాల తహశీల్దార్‌గా విధులు నిర్వహించిన ఇమామ్ బాబా సేక్ భూపాలపల్లి జిల్లా మహముత్తారం మండలంకు బదిలీయినట్లు తహసీల్దార్ తెలిపారు.

## బిజెపి ఆవిర్భావ దినోత్సవం

**ప్రజాపక్షం/తొర్రూరు :** భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండలంలోని అమ్మాపురం గ్రామంలో బిజెపి మండల అధ్యక్షుడు గట్టు రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శివాజీ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బిజెపి జెండాను బిజెపి రాష్ట్ర పూర్వ కార్యవర్గ సభ్యులు లేగ రాంమోహన్‌రెడ్డి ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా బిజెపి పార్టీ అవతరించడం గర్వకారణమన్నారు.భారత నిర్మాణంలో ప్రతీ ఒక్కరూ విధిగా భాగస్వాములు కావాలన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు పల్లె కుమార్, అమ్మాపురం గ్రామ ఉప సర్పంచ్ సిరిపాటి విశాల్, ఒబిసి మోర్చా మండల అధ్యక్షుడు గుండా సురేశ్, కార్యక్రమ కన్వీనర్ ఊర కేశవ్, వార్డు సభ్యులు గంధం యాకమ్మ, ట్టు సుమలత, కిన్నెర నగేశ్,పాండు, కిన్నెర రాజ్‌కుమార్, సరిపాటి మహేశ్ పాల్గొన్నారు.

## గూడూరు సిఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ప్రజాపక్షం/గూడూరు: గూడూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వర్సు వినయ్ కుమార్ ని స్థానిక ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకలు సోమవారం మార్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని అకాంక్షించారు. ఈకార్యక్రమంలో గూడూరు సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలునాయక్ ఉపసర్పంచ్ చంటి స్వామి బీరం శ్రీపాల్‌రెడ్డి రసూల్ రాసమల్ల యాకయ్య తదితరలు పాల్గొన్నారు.

## మహబూబాబాద్ డిసిసి ప్రధాన కార్యదర్శిగా శివరాత్రి సంపత్ నియామకం

ప్రజాపక్షం/గూడూరు: మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి (డిసిసి) ప్రధాన కార్యదర్శి శివరాత్రి సంపత్ నియామకం అయ్యారు. కాంగ్రెస్ జిల్లా మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా శివరాత్రి సంపత్ మాట్లాడుతూ తన నియామాకానికి సహకరించిన మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ మురళినాయక్ ఎంపి పోరిక బలరాం నాయక్ రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూక్య ఉమా మాజీ డిసిసి అధ్యక్షుడు జన్నారెడ్డి భరత్ చంద్రారెడ్డి మాదవపెద్ది రమేష్ చందర్ రెడ్డి ప్రదీప్‌రెడ్డి మండల నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తామని పార్టీ ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కట్టుబడి పని చేస్తానని తెలిపారు.

## పిఎసిఎస్ ఆధ్వర్యంలో జనరిక్ మెడికల్ షాపు ఏర్పాటు



ప్రజాపక్షం/తొర్రూరు : పట్టణ కేంద్రంలోని చింతలపల్లి రోడ్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి జనౌషధి కేంద్రాన్ని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ప్రా టరంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలకు ఈ జనరిక్ మందుల ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. ప్రజలకు ఆరోగ్య సేవలను చేరువ చేయడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సాధారణ ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన ఔషదాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పిఎసిఎస్ సభ్యులు, వైద్య సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/పాలకుర్తి: భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మండ ల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు రవి కుమార్ పార్టీ జెండాను ఎగురవేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. బిజెపి నాయకులు ఉ పేందర్ రెడ్డి, నిరంజన్, దేవరా జ్, సంతోష్, కృపాకర్, శంకర్, చందు, అశోక్, వంశీ, కరుణాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాపక్షం/జఫర్‌గడ్: బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బిజెపి పార్టీ నాయకులు ఘ నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని షాపల్లిలో బీజేపి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా బిజెపి జెండాను ఎగురవేయడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో షాపల్లి గ్రామశాఖ అధ్యక్షులు సురేష్ గౌడ్, నాయకులు కార్తీక్, ప్రేమ్ గౌడ్, వెంకటేశ్వర్లు, నగేష్ గౌడ్, రాజు, వలిబాష, రవి, స్వప్న,, శంకర్, దినేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/దేవరుప్పుల: మండల కేంద్రంలో బిజెపి 47వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షులు బస్వ భాస్కర్ ఆద్వర్యంలో బాజాపా జెండా ఆవిష్కరించి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాగాల నవీన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చింత సృజన్, మండల ప్రధాన కార్యదర్శి పన్నీరు రాజు, మండల గిరిజన మోర్చా అధ్యక్షుడు అన్వేష్, సీతారాం పురం వార్డు మెంబర్ మహే ష్, నాగరాజు, సుధాకర్, లింగమేశ్వర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు నియోజకవర్గ కోసం అఖిలపక్ష ఉద్యమం ముమ్మరం



ప్రజాపక్షం/గూడూరు: గూడూరు మండల కేంద్రంలో గూడూరు నియోజకవర్గ ఏర్పాటు కోసం అఖీలపక్ష ఆధ్వర్యంలో భారీ స్థాయిలో సమావేశం ర్యాలీ నిర్వహించారు.కన్యాకాపరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈసమావేశానికి వివిధ రాజకీయ పార్టీల నాయకలు సర్పంచ్‌లు ప్రజా ప్రతినిధులు కుల సంఘూల ప్రతినిధులు ప్రజా సంఘూలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశంలో అనంతరం అఖీలపక్ష నాయకులు భారీ ర్యాలీగా తహశీల్ధార్ కార్యాలయానికి చేరుకోని తమ డిమాండ్లను తెలియాస్తూ వినతి పత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా నాయకలు మాట్లాడుతూ గూడూరు ప్రాంత ప్రజల అత్మగౌరవానికి ప్రతీకగా నియోజక వర్గం ఏర్పాటు అత్యవసరమని పేర్కోన్నారు.గూడూరు ప్రాంతం భౌగొళిక పరిపాలనా పరంగా అనుకూలతలు కలిగి ఉందని ఇప్పటికే పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలు వాణిజ్య కేంద్రాలు రవాణా సౌకర్యాలు ఉన్నాయని వివరించారు. అందువల్ల గూడూరును నియోజకవర్గన్ని ప్రకటించే వరకు దశలవారీగా ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. అన్ని వర్గాల ప్రజలు ఏకమై ఈ ఉద్యమానికి మద్దతు తెలినాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ చల్లా తింగారెడ్డి బీరవేల్లి భరత్ కుమార్‌రెడ్డి మాజీ జడ్పిటీసి ఖాసీం వేం వెంకటకృష్ణరెడ్డి లింగాల సుధీర్‌రెడ్డి మాజీ ఎంఈవో చీర బిక్షపతి కొమ్మాలునాయక్ గూడూరు మండల సీనియర్ నాయకలు కత్తి స్వామి మేరెడ్డి సురేందర్ మాజీ ఎంపిటీసి సమ్మక్క రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి



ప్రజాపక్షం/తొర్రూరు : క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని ఫత్తేపురం గ్రామ సర్పంచ్ ఇట్టె మాధవ రెడ్డి అన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఫత్తేపురం గ్రామంలో సోమవారం క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మొబైల్ హ్యాండిల్ ఎక్స్‌రే యంత్రాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఈ మిషన్ ద్వారా 31 మందికి పరీక్షలు నిర్వహించారు. సీహెచ్‌ఓ కుసుమ విద్యాసాగర్, డీపీఎంఓ వనాకర్‌రెడ్డి, సర్పంచ్ మాధవరెడ్డిలు మాట్లాడుతూ పంచాయతీల్లో వెయ్యి మంది జనాభా ప్రాతిపదికన టీబీ ముక్త్ పంచాయతీలుగా, ఒకటి కంటే ఎక్కువ కేసులున్న వాటిని సిల్వ ర్ పంచాయతీలుగా, కేసులు లేని వాటిని గోల్డ్ పం చాయతీలుగా ప్రభుత్వం నిర్ణయిస్తుందన్నారు. క్షయ వ్యాధి బారిన పడినవారు క్రమం తప్పకుండా ఆరు నెలల పాటు మందులు వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుందని అన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే క్షయవ్యాధిగా అనుమానించి సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది జ్యోతి, సందీప్, జితేందర్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ సెక్రటరీలపై జాతీయ ఎస్టి కమిషన్ కీలక సిఫారసులు

ప్రజాపక్షం/గూడూరు: మహబూబాబాద్ ములుగు భూపాలపల్లి జనగాం హన్మకొండ వరంగల్ జిల్లాల్లో ఇటీవల నిర్వహించిన పంచాయతీ సెక్రటరీల స్థానచలనాలు పరిపాలనా పరంగా సానుకూల పరిణామమని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ అభిప్రాయపడ్డారు. ఈచర్యల ద్వారా గ్రామీణ పరిపాలనలో పారదర్శకత బాధ్యతాయుతత పెరుగుతాయని ఆయన పేర్కోన్నారు. దీర్ఘకాలంగా ఒకే పంచాయతీలో పనిచేస్తున్న సెక్రటరీలు స్థానిక రాజీయ ప్రభావాలకు లోనయ్యే అవకాశాన్ని ఈ బదిలీలు తగ్గిస్తాయని తద్వారా అధికార దుర్వినియోగానికి అడ్డుకట్ట పడుతుందని ఆయన స్పష్టం చేశారు.పంచాయతీరాజ్ శాఖ తీసుకున్న ఈనిర్ణయానికి సంబంధిత అధికారులకు అభినందనలు తెలియజేశారు. ఇటీవల జరిగిన బదీల నేపథ్యంలో కొంత మంది పంచాయతీ సెక్రరీలు తమ స్వగ్రామాలకు దూరంగా నియమితులవడంతో విధి నిర్వహణలో ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని పేర్కోన్నారు.ఈవిషయంపై పలు సెక్రరీలు జాతీయ ఎస్టీ కమిషన్‌కు వినతి పత్రాలు సమర్పించినట్లు తెలిపారు.ఈసందర్భంలో సంబంధిత సెక్రటరీలు అదే అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని సమీప మాండలాలకు బదిలీ చేయాలని కమిషన్ సిఫారసు చేసింది. ముఖ్యంగా ఎస్‌సి ఎస్‌టి ఇతర బలహీన వర్గాలకు చెందిన ఉద్యోగుల సమస్యలను పరిగణలోకి తీసుకుని మానవీయ దృష్టితో చర్యలు తీసుకోవాలని సూచించింది. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కూడా ఇతర ప్రభుత్వ ఉద్యోగులను మాదిరిగా పంచాయతీ సెక్రటరీల బదీలీలను క్రమం తప్పకుండా నిర్వహించాలని కమిషన్ సూచించింది. ఈ విధానంతో పంచాయతీలకు కేటాయించే నిధులు రాజకీయ ప్రభావాలకు అతీతంగా పారదర్శకంగా వినియోగం అయ్యు అవకాశలు పెరుగుతాయని వెల్లడించింది.

## శాంతి భద్రతల బలోపేతానికి సిసి కెమెరాల ఏర్పాటు



ప్రజాపక్షం/కొడకండ్ల: గ్రామంలో శాంతి భద్రతలను బలోపేతం చేయడంలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఈ సీసీ కెమెరాల ఏర్పాటు పనులను స్థానిక ఎస్‌ఐ రాజుతో కలిసి ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాన్ని నేరరహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు పోలీసుల సహకారంతో నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. గ్రామాభివృద్ధి, మెరుగైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు.ఈ కార్యక్రమంలో జీపీ కార్యదర్శి ఆంజనేయులు, ఏఎస్‌ఐ రమేష్, ఉప సర్పంచ్ ఎండీ షన్న, వార్డు సభ్యులు నవీన్, అందె అరుణ్, వెంకన్న, ప్రేమలత, ధర్మేందర్, అండాలు వెంకన్న, సాయి, దుర్గాసాయి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం



ప్రజాపక్షం/కొడకండ్ల: మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో ప్రజలకు అవసరమైన కనీస సదుపాయాలను ఏర్పాటుచేయడానికి చర్యలు తీసుకుంటామని కొడకండ్ల సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ తెలిపారు. సోమవారం జీపీ కార్యదర్శి ఆంజనేయులుతో కలిసి ఆమె మార్కెట్‌ను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవసరమైన సౌకర్యాలపై చర్చించారు. ముఖ్యంగా మహిళల కోసం మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, విద్యుత్ దీపాలు, గ్రౌండ్‌లెవెలింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు అందె అరుణ్ కుమార్, వెంకన్న, ప్రేమలత, ధర్మేందర్, సురేష్, పాల్గొన్నారు.

## దాడుల సంస్కృతి మానుకోవాలి

ప్రజాపక్షం/రఘునాథపల్లి: గజ్వేల్‌లో మాజీ సీఎం క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు జరిపిన దాడి అత్యంత హేయమైన చర్య అని స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎంపిపి వై కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాస్వామ్య పద్దతిలో వ్యవహరించకపోవడం పట్ల, నిరంకుశ వైఖరికి నిదర్శనమే ఈ దాడి అని ఆయన అన్నారు. ప్రజలు సరియైన సమయంలో, సరియైన నిర్ణయం తీసుకుని కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

## జగన్ నాయకుల గూడెం గ్రామంలో మద్యం నిషేధంపై ఏకగ్రీవ తీర్మానం

ప్రజాపక్షం/గూడూరు: గూడూరు మండలంలోని జగన్ నాయకుల గూడెం గ్రామంలో మద్యం నిషేధంపై గ్రామస్తులకు కీలక నిర్ణయం తీసుకున్నారు.సోమవారం గ్రామ సర్పంచ్ సోలం రాధ సాగర్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సమావేశంలో ఈఅంశంపై విస్తృతంగా చర్చ జరిగింది. గ్రామపెద్దలు మహిళా సంఘూలు యువజన సంఘూల ప్రతినిధులు సమావేశంలో పాల్గోని గ్రామంలో మద్యం వినియోగం వల్ల ప్రజలు ఆరోగ్యపరంగా సామాజికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం అలవాటుతో కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతింటున్నాయని కుటుంబాలపై సమస్యలు పెరుగుతున్నాయని అభిప్రాయడ్డారు. గ్రామంలో పూర్తి స్థాయి మద్యం నిషేధం అమలు చేయాలని సభలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈనిర్ణయాన్ని ఉల్లంఘుంచే వారిపై రూ 5000 జరిమానా విధించాలని కూడా నిర్ణయించారు. ఈ గ్రామ సభలో గ్రామ పెద్దలు పెనుక వేవేందర్ శ్రీను, రమేష్, రామ్మూర్తి పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే గండ్ర పరామర్శ



**ప్రజాపక్షం/గణపురం :** గణపురం మండలంలోని చెల్పూర్ గ్రామ వాస్తవ్యులు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గొట్టేముక్కుల కేశవ్ రావు గారి మాతృమూర్తి కీ.శే తిరుపతమ్మ సోమవారం పరమవదించిగా హన్మకొండ లోని వారి నివాసంలో ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులార్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,తన ప్రగాఢ సానుభూతి తెలియచేసి, తిరుపతమ్మ గారి అంతిమ యాత్రలో పాల్గొన్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, చేల్పూర్ మాజీ సర్పంచ్ నడిపెల్లి మధుసూదన్ రావు, గణపురం మాజీ పిఎసిఎస్ చైర్మన్ పోరెడ్డి పూర్ణ చందర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసిన తిరుపతి



**ప్రజాపక్షం/గణపురం:** గణపురం మండల కేంద్రం లోని స్నేహ ట్రాక్టర్స్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడు గుర్రం తిరుపతి గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం గణపురం ఎస్సై అశోక్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కట్కూరి శ్రీనివాస్, ట్రాక్టర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పొట్లూరి సురేష్, కమిటీ గౌరవ సభ్యులు కసిరెడ్డి వెంకటరమణారెడ్డి, చింతనిప్పుల మధు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మామిండ్ల మల్లికార్జున్ గౌడ్ లు గౌరవప్రదంగా ఎస్సై అశోకు ను సన్మానించారు.

## టిజి ఐఎల్‌పి పిఐపి సర్వే ప్రారంభం

**ప్రజాపక్షం/తాడ్వాయి :** మండలంలోని కాటాపురం గ్రామంలో పేదల గుర్తింపు కోసం నిర్వహించే పిఐపి సర్వే కార్యక్రమం సోమవారం ప్రారంభమయ్యింది. ఈ సందర్భంగా సెర్ప్ అధికారులు గ్రామానికి వచ్చి సర్వే ప్రక్రియను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దిడ్డి మోహన్ రావు మాట్లాడుతూ గ్రామంలో నిజమైన పేదలకు గుర్తించే విధంగా సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఆయన సూచించారు. ప్రతి కుటుంబం వివరాలను సక్రమంగా నమోదు చేసి, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సర్వే ఎస్సి, ఎస్టి కుటుంబాలకు మాత్రమే సర్వే చేస్తారని, గ్రామ ప్రజలు మహిళా సంఘాల సభ్యులు సర్వేలో చురుకుగా పాల్గొని సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సెర్ప్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్య ద్వారా శాస్త్రీయ అవగాహన పెరుగుతుంది

### జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కోట రాజబాబు



**ప్రజాపక్షం/మహాదేవపూర్ :** ప్రయోగాత్మక విద్యా ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెరుగుతుందని జిల్లా గ్రందాలయ చైర్మెన్ కోట రాజబాబు అన్నారు.సోమవారం మండలకేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాల లో సైన్స్ ల్యాబ్‌ను సర్పంచ్ హసీనా బానోతో కలిసి ప్రారంభించారు.అనంతరం మండల విద్యాధికారి పురుషోత్తం రెడ్డి తన తల్లి జ్ఞపకార్థం వితరణ చేసిన టీషర్టులను విద్యారుథలకు పంపిణీ చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాధికారి పురుషోత్తం రెడ్డి విద్యార్థులకు ఏకరూప దుస్తులు వితరణచేయడం అభినందనీయమని అన్నారు.మండలకేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థుల కోసం సైన్స్ ల్యాబ్ అందుబాటులోకి రావడం హర్షణీయమని ప్రయోగాత్మక విద్య ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెరుగుతుందని అన్నారు.విద్యారంగంలో మహాదేవపూర్ మండలం ముందుండాలని ఆకాంక్షించారు.వచ్చే విద్యా సంవత్సరంలో ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి కృషి చేయాలని అన్నారు.సైన్స్ ల్యాబ్ ర్పాటుకు చొరవ చూపిన పాఠశాల ఉపాద్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాద్యాయుడు మల్లేశం,ఉపాద్యాయులు ఎల్కటి శరత్,రషీదా బేగం,తిరుపతి రెడ్డి,వెకటేశ్వర్లు,తిరుపతి,ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పీర్ల కళ్యాణి,సర్వత్ సుల్తానా,మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇర్షాద్,వార్డు సభ్యులు అస్రార్ ఖురేషి,మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఏడు నూతుల నిషిధర్ రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నిషిధర్ రెడ్డి మాట్లాడుతూ, 1980 ఏప్రిల్ 6న మాజీ ప్రధాన మంత్రి శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించిందని, ఈ 47 ఏళ్ల ప్రయాణంలో ఎన్నో విజయాలు సాధించిందని తెలిపారు. పార్టీ కార్యకర్తల కృషి, శ్రమ, త్యాగాలు, పోరాటాల ఫలితంగా బీజేపీ ఈ స్థాయికి ఎదిగి, ఈ రోజు కేంద్రంలో అలాగే అనేక రాష్ట్రాల్లో అధికారంలో ఉందని పేర్కొన్నారు. ఈ స్థాయికి తీసుకువచ్చిన ప్రతి నాయకుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కార్యవర్గ లు జన్నే మొగిలి, పార్లమెంట్ కొకన్వీనర్ లింగంపల్లిప్రసాద్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శిలు దొంగల రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతి రెడ్డి,కార్యాలయం కార్యదర్శి వట్టం తిరుపతి, మీడియా ఇంచార్జ్ మునెందర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సయ్యద్ గాలీఫ్, జిల్లా నాయకులు పొన్నాల కొమురన్న, తుమ్మటి రాంరెడ్డి, తాటికంటి రవి కుమార్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు తీగల జగ్గయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/మహాదేవపూర్ :** మండలకేంద్రంలోని ప్రెస్ క్లబ్ ఆవరణలో వివిధ కుల సంఘాల నాయకుల ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా లింగాల రామయ్య, ఉపాధ్యక్షుడు నల్లబూగ ధర్మయ్య, కార్యదర్శులుగా బెల్లంపెల్లి సురేష్, మెరుగు లక్ష్మ ణ్, కార్యవర్గ సభ్యులుగా ఎండి అమీన్, గడ్డం స్వామి, దాగం సంతోష్, కొండపల్లి రాములు, నల్లబూగ సమ్మయ్య,చింతల వెంకటేశ్వర్లు,కన్నెబోయిన ఐలయ్య,బుర్రి శివరాజ్, చేకుర్తి శంకర్,కుమ్మరి రాజ్‌కుమార్,దుర్గం పోచయ్య, కల్గూరి రాజయ్య,వేమునూరి జక్కయ్య, మోటం వెంకటేశ్వర్లు,చింతకుంటల సతీష్,చింతకుంటల రాందాస్, చకినారపు చందు, ఆయిలి సమ్మయ్య, మోతె సాంబయ్య,చిలుక రమేష్, చింతకుంటల సదానందం, చింతకుంటల రాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు లింగాలరామయ్య మాట్లాడుతూ ఈ నెల 14 న అంబేద్కర్ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని అన్నారు.అంబేద్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో వివిధ కుల సంఘాల నాయకులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# బంజరుపల్లి ప్రాథమిక పాఠశాలకు ప్రొజెక్టర్ విరాళం



**ప్రజాపక్షం/ములుగు :** ప్రవాస భారతీయులు తమ పుట్టిన గ్రామాలను అభివృద్ధి చేయడంలో పాలుపంచుకోవాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు ధనసరి సూర్య అన్నారు. బంజరుపల్లి గ్రామంలో తన తండ్రి అయిన స్వర్గీయ పురం సంజీవరావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన సంస్మరణ సమావేశంలో మంత్రి తనయుడు ధనసరి సూర్య పాల్గొన్నారు. ఈ సందర్భగా బంజరుపల్లి ప్రాథమిక పాఠశాలకు పురం సురేష్ ప్రొజెక్టర్‌ను బహుమానంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ధనసరి సూర్య హాజరై మాట్లాడారు. పురం కుటుంబీకులు గతంలో ఇట్టి ప్రాథమిక పాఠశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఇవ్వడాన్ని గ్రామస్తులు గుర్తు చేసుకోవడం జరిగిందన్నారు. ఇప్పుడు వారి వారసులు అయిన పురం సురేష్ తన తండ్రి ఆశయాలకు అనుగుణంగా వారి దాతృత్వ గుణాలను కొనసాగిస్తూ గ్రామంలో చదువుతున్న విద్యార్థులు విద్యాభివృద్ధికి విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా మరోసారి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం అమెరికాలో నివసిస్తున్న వారి కుమారుడు పురం సురేష్ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డిటిటల్ బోధన అందించాలనే ఉద్దేశ్యంతో ఈ ప్రొజెక్టర్‌ను అందజేయడం వలన ఈ ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులు సులభంగా పాఠాలను అర్థం చేసుకోవడంతో పాటు, కొత్త విషయాలను ఆసక్తిగా నేర్చుకునే అవకాశం కలుగుతుందన్నారు. అంతే కాక విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతుల రూపకల్పనకై తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంచం రఘు, ఉప సర్పంచ్ దాసరి గంగయ్య, వార్డు సభ్యులు తప్పట్ల గణపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మర్రిపల్లి శ్రీలత, ఉపాధ్యాయులు అరుణ్ కుమార్, వార్డు మెంబర్లు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు మిత్రుల సన్మానం



**ప్రజాపక్షం/మహాదేవపూర్ :** ఇటీవల కాటారం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన పోత రామకృష్ణను తనతో కలిసి చదువుకున్న తోటి మిత్రులు మండలకేంద్రంలో సోమవారం శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ పోత రామకృష్ణ మాట్లాడుతూ తన తోటి మిత్రులు తనను సన్మానించడం గర్వంగా భావిస్తున్నానని,మిత్రుల సన్మానం తన ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని అన్నారు.అనంతరం మిత్రులు నూక సత్యనారాయణ మాట్లాడుతూ తోటి మిత్రుడు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికవడం సంతోషకరమని ఇలాంటి మరెన్నో పదవులు పొందుతూ ఎదగాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## వారాంతపు సంతను ప్రారంభించిన సర్పంచ్



**ప్రజాపక్షం/గణపురం :** గణపురం వారాంతపు సంత 2026 27 ఆర్థిక సంవత్సరం సందర్భంగా నూతన టెండర్ పూర్తి కావడంతో సోమవారం గణపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ లాంఛనంగా ప్రారంభించారు. వారాంతపు సంత నూతన టెండర్ ను రూ.4 లక్షల 77 వేలకు మండల కేంద్రానికి చెందిన తిక్క సంపత్ దక్కించుకున్నారు. అందులో భాగంగా దక్షిణముఖ ఆంజనేయస్వామి దేవాలయ అర్చకులు వేద పండితులు శ్రీమాన్ గోవర్ధన వేణుగోపాలచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఓరుగంటి కృష్ణ గౌడ్, దూడపాక శంకర్, మామిండ్ల మల్లికార్జున్ గౌడ్, బత్తిని శివశంకర్ గౌడ్, సైదులు పాష, ఎస్.కె జానీ పాష తదితరులు పాల్గొన్నారు.

## ఫాస్ట్‌ఫుడ్ సెంటర్,హోటళ్లలో తనిఖీలు



**ప్రజాపక్షం/మహాదేవపూర్ :** ప్రజాపాలన ప్రగతి నావేదిక కార్యక్రమంలో భాగంగా ఆహర భద్రతపై దృష్టి కార్యక్రమాన్ని సోమవారం మహాదేవపూర్ ఉమ్మడి మండలంలో నిర్వహించారు.ఈ సందర్భంగాజిల్లా వైద్యారోగ్య అధికారి మధుసూదన్ ఆదేశాల మేరకు అంబట్ పల్లి ఆరోగ్య కేంద్రం వైద్యురాలు కళ్యాణి ఆధ్వర్యంలో అంబట్ పల్లి గ్రామంలోని మిల్లికార్జున ఫాస్ట్‌ఫుడ్ సెంటర్,హోటల్,మిర్చి బజ్జి సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేసారు. వంటగది,ఆహార నాణ్యతను పరిశీలించారు.అనంతరం హోటల్ సరిసర ప్రాంతంతో పాటు ఆహార నాణ్యత,వంట నూనెలు నాణ్యమైనవిగా ఉండాలని వాడిన నూనెలు మళ్లీ వాడకూడదని ఆహార దార్థాలపై మూతలు వేసి ఉంచాలని సూచించారు.ఎలాంటి నిర్లక్ష్యం వహించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ సోనాజీ,హెచ్‌ఏ సత్యనారాయణ,సిడబ్ల్యూ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/అల్లాదుర్గం : మండల కేంద్రంలో స్థానిక బిజెపి కార్యాలయంలో జిల్లా నాయకులు కాల రాములు ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం పార్టీ జెండా ఆవిష్కరించి ఘనంగా జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో బిజెపి పోషిస్తున్న పాత్ర అమోఘం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యాదగిరి వీరయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బేతాళ స్వామి బోనాలు

ప్రజాపక్షం/అల్లాదుర్గం: మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం లో గల రెండవ అతిపెద్ద జాతరగా వేరుగాంచిన బేతాళ స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు సోమవారం బేతాళ స్వామికి ఘనంగా బోనాలు తీశారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు అందంగా అలంకరించిన బోనాలతో గ్రామ పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో డప్పు వాయిద్యాల మధ్య ఆటపాటలతో బేతాళ స్వామికి గోవిందా అని స్మరించుకుంటూ ఆలయం చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేసి స్వామికి వారికి బోనాలు పిండి వంటలతో చేసిన నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాలను తిలకించడానికి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. బేతాళ స్వామి ఉత్సవాల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ ఆదేశానుసారం బేతాళ స్వామి గుడి దగ్గర ఎస్సై శంకర్ ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతర ఉత్సవాల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందు జాగ్రత్త చర్యలో భాగంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా మారకద్రవ్యాలు మత్తు పానీయాలు అమ్మినట్లయితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డాగ్ స్క్వాడ్ సిబ్బంది పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## నిరుపేద యువతి వివాహానికి చేయూత

ప్రజాపక్షం/రాయికల్:రాయికల్ మండలం రామాజీపేట గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన పల్లికొండ లత నరేందర్ ల కూతురు వైశాలి యువతి వివాహానికి చేయుతగా ఆర్థిక సహాయం చేయాలనే ఉద్దేశంతో సోమవారం వివాహ సమయానికి గ్రామంలోని సేవా భావం ఉన్న ప్రజలు గ్రామ వాట్స్ అప్ గ్రూప్‌లో తెలుపగానే తమవంతుగా వారికి తోచినంత ఆర్థిక సాయం చేయగా మొత్తం 18516 రూపాయలు జమ చేసిన రూపాయలు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో యువతికి అందించారు. అదే విధంగా గ్రామంలోని కొందరు యువకులు ఒక గ్రూప్ యుండి వారు కూడా వైశాలి వివాహానికి 5000 రూపాయల ఆర్థిక సహాయం చేశారు.ఇందుకు యువతి వైశాలి, తల్లిదండ్రులు మాట్లాడుతూ నా కుటుంబ పరిస్థితులను చూసి నాకు సహాయం చేయాలని గొప్ప మనసుతో సహాయం చేసినటువంటి నా గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నాను అని తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో తమవంతుగా సహాయం చేసిన సేవా భావం ఉన్న గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నర్సింహులపేట మండలంలో గంజాయి కలకలం



ప్రజాపక్షం/నర్సింహులపేట: నర్సింహులపేట మండలంలో గంజాయి కలకలం రేపుతుంది.గత సంవత్సరం డిసెంబర్‌లో మండలంలోని ఫకీరా తండాలో వృద్ధుడు నేతవత్ రూప్లా తన వ్యవసాయ భూమిలో గంజాయి మొక్కలను సాగు చేశాడు. విషయం తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి మొక్కలు ధ్వంసం చేయడంతో పాటు అరెస్టు చేసి జైలుకు పంపారు. జైలు నుండి వచ్చిన తరువాత మరల పాత పద్ధతిని ఎంచుకున్నాడు. అయితే గతంలో మొక్కలు ధ్వంసం చేయక ముందు కొంత గంజాయిని పొలంలోని చెట్ల పొదల్లో దాశాడు.ఈ క్రమంలో జైలు నుండి వచ్చిన తరువాత దాచిన ఎండు గంజాయిని బస్తాలో ఉంచి సోమవారం విక్రయించే క్రమంలో పోలీసులు పక్క సమాచారం మేరకు పట్టుకున్నారు. కాగా పట్టుబడిన ఎండు గంజాయి విలువ 2లక్షల40వేలు ఉందని నిందితున్ని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఒకసారి గంజాయి మొక్కల సాగు చేసి జైలు పాలైనా కూడా అడ్డదారుల్లో డబ్బు సంపాదించాలని ఎండు గంజాయి విక్రయించే క్రమంలో దొరికిపోయాడు.మారు మూల తండాల్లో గంజాయి సాగు చేసే స్థాయికి ఎదిగారంటే అక్రమ సంపదనపై వారికి ఉన్న అత్యాశ ఎంత వరకు ఉందో తెలుస్తుంది.అసలు ఈ తండాకు గంజాయి మొక్కలు ఎక్కడి నుండి వచ్చాయి.వృద్ధుని వెనుక ఉన్న వ్యక్తులు ఎవరనేదనిపై మండలంలో చర్చనీయాంశంగా మారుతుంది.రాబోయే రోజుల్లో గంజాయి మహమ్మరి తమ పిల్లల భవిష్యత్‌ను దెబ్బతీసేలా ఉందని తల్లిదండ్రులు భయానికి గురవుతున్నారు.

# మరో కీలక మైలురాయి సాధించిన వరంగల్ ఎంపి



ప్రజాపక్షం/హనుమకొండ : వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మరో కీలక మైలురాయిని సాధించారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన హనుమకొండలోని రుద్రేశ్వర స్వామి వేయి స్తంభాల గుడి అభివృద్ధి కోసం కేంద్రం నుంచి భారీ నిధులు మంజూరు కావడంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య కృషి ఫలించింది.వేయి స్తంభాల ఆలయం, అదే ప్రాంగణంలోని కల్యాణ మండపం అభివృద్ధి, విస్తరణతో పాటు మిగిలిపోయిన పునరుద్ధరణ పనుల కోసం రూ.14.44 కోట్ల నిధులు మంజూరు చేయించడంలో ఎంపీ కడియం కావ్య కీలక పాత్ర పోషించారు. ఈ నిధులతో కాకతీయుల కాలం నాటి శిల్ప వైభవాన్ని తిరిగి తీసుకురావడమే లక్ష్యంగా పనులు చేపట్టనున్నారు.గతంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య గారు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను పలుమార్లు కలిసి, వేయి స్తంభాల గుడి అభివృద్ధి అవసరాన్ని వివరిస్తూ ఎంపీ చేసిన నిరంతర ప్రయత్నాలే ఈ ఫలితానికి కారణం అయ్యాయి.గతంలో పురావస్తు శాఖ అధికారులతో కలిసి స్వయంగా ఆలయాన్ని సందర్శించి, పునరుద్ధరణ అవసరాలను అధ్యయనం చేసిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వెంటనే కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించారు.ఇటీవల కేంద్ర పురావస్తు శాఖ పనులకు టెండర్లు పిలవడంతో పనులు ప్రారంభానికి రంగం సిద్ధమైంది. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో పాటు పురావస్తు శాఖ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి, ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. గత ఏడాది కేంద్ర మంత్రిని కలిసి సుమారు రూ.15 కోట్ల నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేసిన విషయం గుర్తు చేస్తూ, అందుకు సానుకూలంగా స్పందించిన కేంద్రం రూ.14.44 కోట్లు కేటాయించడం వరంగల్ అభివృద్ధికి శుభసూచకమని పేర్కొన్నారు. కాకతీయుల శిల్ప కళా సంపదకు ప్రతీకగా నిలిచిన వేయి స్తంభాల గుడి అభివృద్ధి ద్వారా పర్యాటక రంగం మరింతగా అభివృద్ధి చెందడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. "వారసత్వాన్ని కాపాడుతూ అభివృద్ధి" అనే లక్ష్యంతో ముందుకు సాగుతూ వరంగల్ లో నూతన ప్రాజెక్టుల సాధన కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యకి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# పేదరికం కంటి చూపుకు అడ్డంకి కాకూడదు

**మాజీ మున్సిపల్ చైర్మన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్**



ప్రజాపక్షం /పెగడపల్లి : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో లయన్స్ క్లబ్ ఆఫ్ జగిత్యాల, రేకుర్తి కంటి ఆసుపత్రి మరియు లయన్ చిదుర సురేష్ (PDG) సౌజన్యంతో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మరియు ప్రోగ్రామ్ చైర్‌పర్సన్ లయన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదరికం కంటి చూపుకు అడ్డంకి కాకూడదని,ఆర్థికంగా వెనుకబడిన గ్రామీణ ప్రజలకు కంటి చూపు సమస్యల నుండి విముక్తి కల్పించి, నాణ్యమైన వైద్యం అందించడమే ఈ శిబిరం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ సమాజ సేవలో ముందుంటుందని కొనియాడారు. శిబిరంలో పరీక్షలు నిర్వహించిన అనంతరం, అవసరమైన వారికి రేకుర్తి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పెగడపల్లి సర్పంచ్ ఒరుగల అరుణ శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, ఉప సర్పంచ్ బత్తుల ప్రదీప్, వార్డు సభ్యులు నంది మహిపాల్, ఒరుగల అంజమ్మ కొమురయ్య, గండ్ర మంగ శ్రీనివాస్ రెడ్డి, బొమ్మన సరోజన పురుషోత్తం, గర్వందుల శిరీష శేఖర్, బొమ్మెన శంకర్, కాంగ్రెస్ నాయకులు గండ్ర వెంకటరావు, చాట్ల ప్రశాంత్, విజయ భాస్కర్, భోగ భూమయ్య, వంశీధర్ రావు, ప్రవీణ్, ఎల్లయ్య పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పరామర్శ



ప్రజాపక్షం/తరిగొప్పుల: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నర్సాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాజయ్య ఇద్దరు కుమారులు ఏనుగుల అశోక్, లోకేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పింగిలి జగన్మోహన్ రెడ్డి, చిలువేరు లింగం, ఏడెల్లి శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వర్ గౌడ్, పోచయ్య,సురేందర్, రవీందర్, శ్రీను, రాజు, బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయాలి

ప్రజాపక్షం/తరిగొప్పుల: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారుల పాలు చేయొద్దని మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. మండలంలోని అబ్దుల్ నాగారం గ్రామంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మార్క్ ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డితో ఫోన్ ద్వారా మాట్లాడుతూ ఇక్కడ ఉన్నటువంటి రైతుల బాధలను వివరించారు. ఇక్కడ మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేస్తే రైతులకు ఎంతో ఉపయోగపకరంగా ఉంటుందన్నారు. స్పందించిన ఆయన త్వరలోనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేస్తామన్నారు. దీంతో రైతులు ఎమ్మెల్యే పల్లాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాజీ సీడ్ డైరక్టర్ సంపత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, నాయకులు లింగం, మల్లయ్య, రవి, లాలు నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, బాలరాజు, శ్రీనివాస్, పోచయ్య, థామస్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వార్డు మెంబర్లకు శిక్షణ తరగతులు

ప్రజాపక్షం/ నిజాంపేట్ : నిజాంపేట మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో నిజాంపేట మండలంలో నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ వార్డు మెంబర్లకు రెండో విడత రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ఎంపీడీఓ రాజిరెడ్డి హాజరై గ్రామపంచాయతీలో సమస్యలను ఎలా ఎదుర్కోవాలని విషయాల పైన పంచాయతీరాజ్ చట్టాల పైన అవగాహన పెంచుకొనుట కోసం ఈ శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ నార్లపూర్ ఉపసర్పంచ్ కుమ్మరి రామచంద్రం, కల్వకుంట వార్డు మెంబర్లు నూజ్జత్ సుల్తాన్, రేణుక వివిధ గ్రామాల వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

## హెచ్.పి.వి టీకాతో గర్భాశయ క్యాన్సర్‌కు చెక్

ప్రజాపక్షం/పాపన్నపేట : హెచ్‌పివి టీకాతో గర్భాశయ క్యాన్సర్‌ను పూర్తిగా నిర్మూలించవచ్చని పాపన్నపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అన్వర్ పేర్కొన్నారు. సోమవారం పాపన్నపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ వీ పీ టీకాల కార్యక్రమాన్ని సర్పంచ్ పావని నరేందర్ గౌడ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 9 నుంచి 14 సంవత్సరాల బాలికలకు ఉచిత హెచ్‌పీవీ టీకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ టీకా గర్భాశయ క్యాన్సర్ మరియు ఇతర క్యాన్సర్లకు కారణమయ్యే హ్యూమన్ పాపిల్లో మా వైరస్ నుండి రక్షణ కల్పించే సురక్షితమైన నివారణ మందు అని పేర్కొన్నారు. ఇది 9 నుంచి 26 సంవత్సరాల వయస్సు వారికి(ముఖ్యంగా 1415 ఏళ్ల బాలికలకు) అత్యంత ప్రభావంతంగా పనిచేస్తుందన్నారు. తొలి రోజు 16 మంది బాలికలకు ఈ టీకాలు వేశారు. తహశీల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీఓ విష్ణువర్ధన్, హెల్త్ సిబ్బంది రాజశ్రీ, ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.